3వ పాఠం

జూలై 11-17

# క్రీస్తునందు ఐక్యత

**సబ్బాతు మధ్యాహ్నము** **జూలై 11**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : 1కొరింథి 1:12-17; రోమా 1:29; 1కొరింథి 1:10; 1కొరింథి 3:1-4; ఫిలిప్పి 2:5-8; 2కొరింథి 11:23-28; కొలస్స 1:24.**

**కంఠతవచనం: "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక ఏక మనస్సుతోను, ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులైయుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1కొరింథి 1:10).**

కొన్ని రకాలైన అడవి జంతువులు, వాటివాటి జాతుల చొప్పున, గుంపులు గాను లేక మందలుగాను గుమిగూడి జీవించుటను అడవిని సందర్శించే సందర్శకులు కనుగొన్నారు. తోడేళ్లు మొదలుకొని డాల్ఫిన్లు వరకు చివరికి దండు చీమలు సహా మందలుగా కలిసి జీవిస్తాయి. చింపాంజీలు మరీ ముఖ్యముగా ఒక చోటే దగ్గరగా చేరి సామాజిక బంధమును కలిగి జీవిస్తాయి. ఒక్కొక్క గుంపులో 15 నుండి 150 చింపాంజీలు కలిసి జీవిస్తాయి. అయితే అన్ని వేళలా వాటి మధ్య సామరస్యము లేకపోవుట వలన చింపాంజీలు ఒకదానితో మరొకటి పోట్లాడుకుంటాయి.

మానవులు కూడా కొన్ని సందర్భాలలో ఆవిధముగానే అనగా వేర్వేరు సమాజములుగా ఏర్పడి జీవించుటయే గాక, వారిలో వారు పోట్లాడుకుంటారు. వాస్తవానికి మన క్రైస్తవ సంఘాలలో కూడా అటువంటి పరిస్థితులను అక్కడక్కడ చూడవచ్చును. ఏదో ఒక ప్రత్యేకమైన తలాంతులతో ఆకర్షించకలిగే వ్యక్తుల చుట్టూ జనము ప్రోగుపడి అతడిని ఒక నాయకుడుగా ఏర్పాటు చేసుకొని అతనిని వెంబడిస్తూ వేరే గుంపుగా ఏర్పడి అటువంటి ఇతర గుంపులతో వాగ్వాదమునకు దిగుతారు.

అటువంటి పరిస్థితిని మీరెప్పుడైనా మీ ప్రాంతీయ సంఘములో చూసారా? మీరు చూచియుంటే కొరింథులో పౌలు ఎదుర్కొనిన వ్యతిరేకతను గూర్చి బాగుగా అర్థము చేసుకొనగలుగుదురు. ఈ వారం మన అధ్యయనములో 1కొరింథి 1-4లో అపొస్తలుడైన పౌలు కొరింథులోని క్రైస్తవ సంఘములో తలెత్తిన సమస్యలకు మూల్యముగా క్రీస్తు నందు ఐక్యత ద్వారా సంఘములో ఎదురైన కొట్లాటలకు ఏవిధముగా పరిష్కార మార్గములను సూచించాడో పరిశీలించబోవుచున్నాము.

– జూలై 18, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుదము.

ఆదివారం జూలై 12

## క్రైస్తవ సంఘములో వర్గ బేధములవలన ఎదురైన సమస్యలు

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క మొదటి నాలుగు అధ్యాయములు పౌలు కొరింథులోని క్రైస్తవ సంఘమునకు చేసిన విన్నపమును గూర్చి ప్రధానముగా చర్చించుచున్నది. "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలు లేక, ఏక మనస్సుతోను, ఏక తాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1కొరింథి 1:10). నిజానికి ఈ పత్రికలో పేర్కొనిన విభిన్న అంశములకు పరిష్కారమార్గముగా వారి మధ్యన ఉండవలసిన ఐక్యత చుట్టూ ఆవరించియున్నదని ఎక్కువమంది పండితులు అంగీకరించుచున్నారు.

**1కొరింథి 1:12-17 చదువుడి. ప్రాంతీయ సంఘములోని నాయకుల చుట్టూ ముఠాలుగా ఏర్పడుట ఎంత అసందర్భమైన విషయమో మనము అర్థము చేసుకొనుటకు ఈ వాక్యాలు ఏవిధముగా సహాయపడును? పౌలు సూచించిన పరిష్కారము ఏమిటి?**

కొరింథులో ఉన్న క్రైస్తవ సంఘములో ఐకమత్యము లోపించిందని వర్ణించుటకు పౌలు చాలా ఘాటైన మాటలను ఉపయోగించెను. గ్రీకు భాషలో మత బేధమును తెలియజేసే "సిజ్మ్" (విభజన) (1కొరింథి 1:10) మరియు 'ఐరిస్' (వాదన) (1కొరింథి 1:11) అనే మాటలను ఆయన ఉపయోగించెను.

నామ వాచకం మరియు క్రియాపదమైన (స్కిజో) (చీలిక లేక విభజన) అనే పదములను నూతన నిబంధనలో ముఠా కక్షలను వివరించుటకు వాడిన పదములను ఇక్కడ ఉపయోగించెను. ఈ మాటలలో ముఖ్యముగా "ఇరిస్" (వాదనలు) అనే పదమును క్రైస్తవులు ఉపయోగించకూడదనియు, అది తప్పిదములను సూచించే మాటలలో ఒకటని ఆయన భావించెను.

**రోమా 1:29; రోమా 13:13; 1కొరింథి 3:3; 2కొరింథి 12:20 మరియు గలతీ 5:20 చదువుడి. 'ఇరిస్' వాదనలు అనే పదము ఏ ఇతర పాపములను వివరించుటకు ఉపయోగిస్తారో మరియు ఆ పదము ఎంత చెడ్డదో మనకు తెలియజేస్తుంది?**

ఒకరి మీద ఒకరు న్యాయస్థానములలో పోరాటములు చేసుకొనే విధముగా కొరింథులో క్రైస్తవ సంఘములో విబేధములు ఏర్పడినవి. (1కొరింథి 6:1-3). మీకు సిగ్గు రావలెనని చెప్పుచున్నాను (1కొరింథి 6:5) అని సంఘ సభ్యులలో కొందరు ఒకరి మీద ఒకరు చేయుచున్న న్యాయ పోరాటముల విషయములో పౌలు తన బాధను వ్యక్తపరచెను. చివరికి వారు 'ప్రభురాత్రి భోజన సంస్కారములో పాల్గొనే సమయములో కూడా వారి విబేధాలను విడనాడలేదు" (1కొరింథి 11:17-22).

కొరింథు క్రైస్తవ సంఘ సభ్యుల మధ్య ఉన్న "అనైక్యత" అనే సమస్య ఎంతో భయంకరముగా ఉన్నందున పౌలు ఆ పరిస్థితి విషయమై ఆందోళనకు గురై అదే వారి మధ్య నున్న ప్రధమ సమస్యగా భావించి కొరింథులో ఉన్న క్రైస్తవులకు తన పత్రిక ద్వారా తెలియపర్చెను.

**మరొకసారి 1 కొరింథి 1:12-27 చదువుడి. క్రైస్తవ సంఘములో ముఠాలుగా ఏర్పడుట ఎందువలన ప్రమాదకరమైన విషయమో అర్ధము చేసుకొనుటకు ఈ వాక్యాలు మనకు ఎట్లు సహాయపడును? ఈ సమస్య తలెత్తకుండుటకు మీ ప్రాంతీయ సంఘము ఏమి చేయగలదు?**

సోమవారం జూలై 13

# యేసునందు కేంద్రీకృతము చేయుము

**1కొరింథి 1:10 చదువుడి. "ఏక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను కలిసి యుండుడి" అని సలహాయిచ్చుటలో పౌలు యొక్క ఉద్దేశము ఏమైయుందని భావిస్తున్నావు?**

క్రైస్తవ సంఘ సభ్యులు ముఠాలుగా ఏర్పడటమంటే క్రీస్తుయెడల చూపించవలసిన భక్తి వారిలో లేదనుటకొక నిదర్శనమైయున్నది (1కొరింథి 1:10) "మన ప్రభువైన యేసుక్రీస్తు అను తన కుమారుని సహవాసమునకు దేవుడు మనలను పిలిచెను" (1కొరింథి 1:9). క్రీస్తు మన ప్రభువైనందున మనము ఆయనను కేంద్రముగా చేసుకొనాలి. కేంద్ర స్థానములో క్రీస్తును ఉంచాలి. అపుడు క్రీస్తు విభజించబడి యున్నాడా? పౌలు మీ కొరకు సిలువ వేయబడెనా? లేక మీరు పౌలు నామములో బాప్తిస్మము పొందితిరా? (1కొరింథి 1:13) అనే అలంకార సంబంధమైన ప్రశ్నలకు పెద్దగా ధ్వనించే "లేదు" అనే జవాబు అందులో కనిపిస్తుంది. "క్రీస్తు విభజింపబడలేదు. క్రీస్తే మన కొరకు సిలువ వేయబడెను. మనము తండ్రి యొక్కయు ఆయన కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మము పొందితిమి" (మత్తయి 28:19).

"అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమైయుండి వేరువేరుగా అవయవములైయున్నారు" (1కొరింథి 12:27) అని పౌలు మనలను గూర్చి చెప్పాడు. ఒక దేహములో అనేక భాగములున్నవి. ప్రతి భాగమునకు ప్రత్యేకమైన పని ఉంది. అయినా ఆ భాగాలన్నియు కలిసి ఒక దేహముగా ఏర్పడును. దేహము సక్రమముగా పనిచేయుటకు ప్రతి భాగము దానికున్న సామర్ధ్యమును బట్టి పనిచేయాలి. ఈ రూపకాలంకారమును బట్టి పౌలు ఐకమత్యమును గూర్చి చూస్తున్నాడు గాని, ఏక రీతిని గూర్చి చూచుటలేదు. ఆయన భిన్నత్వములో ఏకత్వమును (ఐకమత్యమును) చూస్తున్నాడు. ఇంకా లోతుగా వెళ్ళినట్లయితే భిన్నత్వము ఉన్నప్పటికి ఆయన ఐకమత్యము కొరకు చూస్తున్నాడు.

ఏది ఏమైనా సమస్త తలంపులు మరియు అభిప్రాయాలు అవన్నియు కూడా మన ప్రభువైన క్రీస్తుకు సమర్పించాలి. క్రీస్తు మన ప్రభువైయున్నాడనే అంశము పౌలు దృష్టిలో ఎంతో ప్రాముఖ్యమైన తలంపైనందున 1కొరింథి పత్రిక ఆరంభము నుండి ఆ విషయాన్ని అనేకమార్లు ప్రస్తావించాడు (1కొరింథి 1:2,7,8,9,10) ఆ విధముగా పౌలు ముందుగా మానవ నాయకుల గూర్చి సంఘ సభ్యుల మధ్య ఏర్పడిన ముఠాలను గూర్చి చర్చించకముందే అందరూ యేసును మన ప్రభువుగా కలిగియుందామని ఆరంభములోనే నొక్కి చెప్పెను. సంఘము మానవ నాయకుల కేంద్రముగా కాకుండా క్రైస్తవులందరికి యేసు కేంద్ర నాయకుడై యుండాలని బోధించెను.

యేసు మన ప్రభువైయున్నాడనే విషయాన్ని కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక ఆరంభములోనే నొక్కి చెప్పుట వలన పౌలు వ్రాసిన ఈ క్రింద వాక్యములోను మాటలను అర్థము చేసుకొనుటకు సహాయపడును. "మీరందరు ఏక మనస్సుతో ఏకతాత్పర్యముతో ఐక్యపర్చబడాలి" (1కొరింథి 1:10).

"యునైటెడ్" అనే పదము గ్రీకు భాషలోని క్రియా పదమైన "కటార్టిజో" నుండి తర్జుమా చేయబడినది. అనగా దాని పూర్వ స్థితికి తెచ్చే సందర్భములో వాడబడినది. మానవ నాయకుల చుట్టూ ముఠాలుగా ఏర్పడుటచే క్రైస్తవ సంఘ బాంధవ్యాలు చెడిపోయిన స్థితి నుండి తినిగి సంఘంలో క్రీస్తునందున్న ఐక్యతను నెలకొల్పుటకు స్వార్ధ్యమును విడువవలసినదే అనే భావము కలుగుచున్నది.

**కొన్ని దశాబ్దాల క్రితం ఎడ్వంటిస్టు సంఘములో చిన్నచిన్న గుంపులకు బైబిలు తరగతులను నిర్వహించాలని ప్రోత్సహించబడెను. అయితే ముఠాలకు చిన్నచిన్న గుంపులకు మధ్య తేడా ఏమిటి? ఈ బైబిలు తరగతి గుంపులు ముఠాలుగా ఏర్పడకుండా ఎట్టి జాగ్రత్తలు తీసుకోవాలి?**

**మంగళవారం** **జూలై 14**

## జ్ఞానము మరియు పరిపూర్ణత

సాధారణముగా మానవ నాయకులలో కొందరు చాలా ఉన్నతమైన వారుగా పరిగణించబడుట వలన ముఠాలు ఏర్పడతాయి. ఇట్టి పరిస్థితి క్రైస్తవ సంఘ ఐక్యతకు, సభ్యుల ఆధ్యాత్మిక ఆరోగ్యమునకు బెదిరింపువలె ఏర్పడి ఇతరుల యొక్క ఉనికికే ప్రమాదముగా ఉండే రీతిలో కొంతమంది నాయకులు అధికమైన ప్రాధాన్యతను కోరుకుంటారు. అట్టి ప్రవర్తన కలిగిన వాతావరణము వలన సభ్యుల మధ్య పోటీతత్వము పెరిగి సంఘములో చీలిక ఏర్పడే పరిస్థితి ఎదురవుతుంది. దీనికన్నా ప్రమాదకరమైన విషయమేమంటే నాయకులను సంఘము యొక్క గుర్తింపునకు మనము వాడుకున్నచో మన జీవితాలలో క్రీస్తునకుండవలసిన ప్రధానస్థానము నుండి ఆయనను తొలగించే ప్రమాదములో పడిపోయే పరిస్థితి ఎదురవుతుంది.

**1 కొరింథి 3:1-4 చదువుడి. కొరింథీయుల మధ్య ఉన్న ఆధ్యాత్మిక అపరిపూర్ణ పరిస్థితిని పౌలు ఏవిధంగా వర్ణించాడు?**

దేవుని యొక్క జ్ఞానమును ఆత్మీయ పరిపూర్ణత కలిగిన విశ్వాసి గ్రహించగలుగును (1కొరింథి 2:6,7) దేవుని గూర్చిన జ్ఞానమును మనకు ఆత్మ నేర్పించును. (1కొరింథి 2:13) ఆత్మ నేర్పించే జ్ఞానము, ఈ లోక జ్ఞానములో ఉన్న తేడాను మనము గ్రహించే విధముగా సహాయపడుతుంది. (1కొరింథి 2:6) క్రీస్తు యొక్క సిలువలో దేవుని జ్ఞానము బహిరంగ పరచబడెను (1కొరింథి 2:1-4) ఇంకా వివరంగా చెప్పవలసి వస్తే క్రీస్తు యొక్క శ్రమలలోను, ఆయన మరణములోను, పునరుత్థానములోను దేవుని జ్ఞానము బయలుపర్చబడెను. ఆవిధముగా క్రైస్తవ సంఘములో ఐక్యత ఉండాలని బోధించుటకు ముందుగా క్రైస్తవులకు నిజమైన జ్ఞానము మరియు క్రీస్తునందు పరిపూర్ణత అవసరమని గుర్తించాలని పౌలు బోధించుచున్నాడు (1కొరింథి 3:1-17).

దేవుని జ్ఞానము మరియు పరిపూర్ణత కలిగిన క్రైస్తవులు ఆత్మ సంబంధులైన మనుష్యులైయుందురు గాని శరీర సంబంధులుగాను లేక పసిబిడ్డలవలెను ఉండరు. (1కొరింథి 3:1) వారు ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మసంబంధమైన సంగతులతో పోల్చి సరి చూచుకుంటారు. (1కొరింథి 2:13,14) జ్ఞానము మరియు పరిపూర్ణత చెందిన క్రైస్తవులు పాలతో గాక అన్నమనే బలమైన ఆహారముతో పెంచబడుదురు (1కొరింథి 3:2ను హెబ్రీ 5:12తో పోల్చి చూడుడి). పాలతో పోషింపబడిన విశ్వాసి నీతి వాక్యము విషయములో అనుభవము లేనివాడై యుండును. అతడు పసివాడై యుండును. అయితే బలవర్ధకమైన ఆహారము వయసు వచ్చినవాడు తినగలడు గనుక అతడు అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియము కలిగి యుండును (హెబ్రి 5:13,14) పరిపూర్ణత చెందిన మరియు జ్ఞానులైన క్రైస్తవులు “నేను పౌలు వాడను, మరియొకడు నేను అపొల్లో వాడను అని చెప్పుటకు వారు ప్రకృతికి సంబంధించిన మనుష్యులు కారు” (1కొరింథి 3:4).

నిజముగా వీరు కూడా “దేవుని యొక్క జత పనివారుగా ఉన్నారు. (1కొరింథి 3:9) మనము క్రైస్తవ సంఘముగా దేవుని వ్యవసాయమును దేవుని గృహమునైయున్నాము (1కొరింథి 3:9,10,16,17) మన మందరము క్రీస్తు ద్వారా దేవునికి చెందినవారము. (1కొరింథి 3:11).

**మీరు ఎంతగానో అభిమానించిన వ్యక్తి మిమ్ములను నిరుత్సాహపర్చిన అనుభవము మీకు ఎప్పుడైనా కలిగినదా? అట్టి అనుభవము మీకు కలిగియున్న యెడల దానినుండి మీరు ఏమి నేర్చుకున్నారు?**

బుధవారం జూలై 15

## క్రీస్తుని పోలిన దాసుని స్వరూపము

**1కొరింథి 4:1,2 చదువుడి. మానవ నాయకుల విషయములో ఉండవలసిన సరియైన అవగాహన గూర్చి ఈ వాక్యములు ఏమి బోధించుచున్నవి?**

1కొరింథి 3:1–4లో ఆత్మీయ పరిపూర్ణత లోపించుట వలన క్రైస్తవ సంఘములలో ముఠాలు ఏర్పడునని పౌలు సూచించుచున్నాడు. అయితే ఈ అంశమును గురించి చర్చించుటకు ముందుగా పౌలు రూఢిగా ఇలాగు చెప్పుచున్నాడు. "మనమైతే క్రీస్తు మనస్సు కలిగిన వారము" (1కొరింథి 2:16).

క్రీస్తు ఆలోచన విధానమును మరియు పని చేయు విధానమును ఈ పద జాలము సూచించుచున్నది. ఇంకొక విధముగా చెప్పాలంటే విశ్వాసి క్రీస్తు యొక్క మనస్సును కలిగియున్న యెడల అతడు క్రీస్తు వలె ఆలోచిస్తాడు. ఆయన వలె పనిచేస్తాడు. అయితే జీవితమునకు సంబంధించిన అన్ని విషయాలలో క్రీస్తుకు కలిగిన మనస్సును పెట్టి పనిచేయడము అనుకున్నంత సులభమైన విషయము కాదు. అవును కదా? గ్రీకు మరియు రోమా అధికారము కలిగిన ప్రపంచములో రాజకీయ వేత్తలకు, తత్వవేత్తలకు విభిన్నముగా ఆలోచించు వారికి మరియు మత నాయకుల మధ్య అన్ని విషయాలలో చాలా పోటీ పడేవారు. ఇటువంటి పరిస్థితులలో కొరింథులో ఉన్న సంఘము లౌకిక ప్రమాణములను అనుసరించి జీవించుట ద్వారా వారికి సాంప్రదాయబద్ధమైన గుర్తింపు లభిస్తుందనే కోరిక చాలా బలముగా ఉండెడిది. అట్టి లక్షణము నేటి క్రైస్తవ సంఘములో కూడా ఉన్నట్లయితే అది చాలా ప్రమాదకరమైన ఫలితాలకు నడిపిస్తుంది.

**ఫిలిప్పీ 2:5–8 చదువుడి. "క్రీస్తు మనస్సును కలిగియుండుట" (1కొరింథి 2:16) అనే పదమును అర్థము చేసుకొనుటకు ఈ వాక్యాలు మనకు ఏవిధముగా సహాయపడును?**

కొరింథులోని క్రైస్తవ సంఘములో విశ్వాసులు గుంపులుగుంపులుగా విడిపోయినట్లు ఫిలిప్పీలోని క్రైస్తవ సంఘములో (ఫిలిప్పీ 2:1–4) కూడా కొంచెము తక్కువ పరిమాణములో అభిప్రాయ బేధములు ఏర్పడినవి. క్రీస్తును పోలిన దాసుని స్వరూపమును ఒకరు కలిగియుండాలంటే అతడు తనను తాను రిక్తునిగా చేసుకొని స్వార్థపూరితమైన కోరికలను విడనాడి, తనను తాను యోగ్యునిగా ఎంచుకొనక తనకంటే ఇతరులు లేక తన తోటి విశ్వాసులు యోగ్యులని ఎంచి యేసు చేసినట్లు వారికి ఆశీర్వాదకరముగా జీవించవలెను (ఫిలిప్పీ 2:1–8).

క్రీస్తును పోలిన దాసుని స్వరూపము అనగా "క్రీస్తు సేవకులు" అని పౌలు యొక్క ఉద్దేశమైయున్నది. (1కొరింథి 4:1) ఈ పద సముదాయము క్రీస్తుకు సహాయకులుగాను లేక క్రీస్తుకు లోబడిన సేవకులుగాను సేవ చేయుటకు వారు సంసిద్ధులైయున్నారనే భావమును తెలియజేయుచున్నది. క్రీస్తు యొక్క నాయకత్వ మాదిరిని మానవ నాయకులు

అనుసరించుటయే సరియైన విధానమని ఈ వాక్యము సెలవిస్తున్నది. సేవకులను గృహ నిర్వాహకులుగా కూడా సూచించుట జరిగింది (1కొరింథి 4:1,2). వేరే ఒకరి ఆస్తిని నిర్వహించే బాధ్యత కలిగియుండుటే గృహనిర్వాహకత్వములో ఉన్న నిజమైన బాధ్యత. మనము ఏమి కలిగియున్నామో అదంతయు క్రీస్తుకు చెందినదనే భావము ఇందులో ఇమిడియున్నది.

**ప్రార్థనా పూర్వకముగా ఫిలిప్పీ 2:5-8లో ఉన్న వర్తమానమును గూర్చి ధ్యానించుడి. మన యెడల దేవునికున్న ప్రేమ తనను తాను తగ్గించుకునే ప్రేమకు చెందినదనే భావమును మనము ఏవిధముగా గ్రహించగలము? దేవుడు చూపిన ఆ ప్రేమను పోలి మనము నడుచుకొనవలెనంటే ఒక విధముగా మనము కూడా మన పరిధిలో ఏ విషయాలలో మన స్వార్థమునకు మనము మరణించవలసి యున్నది?**

గురువారం జూలై 16

## సిలువను ప్రతిబింబించే జీవన శైలి

వాస్తవానికి మనము మానవ నాయకుల చుట్టూ చేరి ముఠాలుగా ఏర్పడకూడదు. అంతమాత్రాన నాయకులను బలపర్చకూడదు లేక వారిని వెంబడించకూడదు అని దాని అర్థము కాదు. సంఘపరిచర్యలో సహాయపడే వారిని మనము ప్రోత్సహించాలి. దేవుని పరిచర్యను చేయమని దేవుడు ప్రజలను ఆదేశించాడు. క్రైస్తవ నాయకులలో ఎవరైతే సిలువను ప్రతిబింబించే జీవనశైలిని కలిగి యుంటారో అట్టి నాయకుల మాటలను వినుటయే గాక వారిని వెంబడించాలి. దేవుని వాక్యమునకు ఎవరైతే విధేయత చూపిస్తారో అట్టివారు సిలువ శక్తిని కలిగియుంటారు కాబట్టి వారు తమ సొంత ఉద్దేశములకు బంధీలుగా ఉండరు. దేవుని వాక్యానుసారముగా నడుచుకుంటారు. క్రీస్తును పోలినటువంటి నాయకులు దేవుని పరిచర్యలో వచ్చే సాఫల్యతను లేక జయమును దేవునికే చెందినదిగా పరిగణిస్తారు. భూమిమీద యేసు ఒక మానవుడుగా దేవుడు తనకు అప్పగించిన పనినంతటిని చేసి దేవునిని మహిమపరచెను (యోహాను 17:4)

అపొస్తలుడైన పౌలు ప్రకారము విశ్వాసముతో కూడిన క్రైస్తవ పరిచర్య సిలువను గూర్చిన ఒక వేదాంతము మీద ఆధారపడి ఉండును. రక్షించుటకు అవసరమైన దేవుని జ్ఞానము మరియు ఆయన శక్తిని సిలువ బయలుపరుస్తుంది, అదే సమయములో మానవుని యొక్క జ్ఞానము వెర్రితనమని (సిలువ) చూపించును. సిలువను గూర్చిన ఒక వేదాంతము ఏమైయుంటుందో అనే విషయాన్ని పౌలు 1కొరింథి 4:1-13లో వివరించాడు. మొదటగా క్రైస్తవ నాయకత్వమునకు ఉండవలసిన ప్రమాణమును దేవుడే నియమిస్తాడని పౌలు సూచించాడు (1కొరింథి 4:1-5) రెండవదిగా యదార్థమైన క్రైస్తవ పరిచర్య చేసేటపుడు శ్రమలను ఎదుర్కొనుటనునది ఒక ప్రత్యేకమైన గురుతుగా ఉంటుందని ఆయన పేర్కొన్నాడు. (1కొరింథి 4:9,11-13) ఈ రెండవ అంశమును గూర్చి కొంత లోతైన అధ్యయనము చేయవలెను.

**2కొరింథి 11:23-28 కొలస్స 1:24 చదువుడి. క్రీస్తు కొరకు శ్రమపడుట అనగా దాని అర్ధమేమిటని ఈ వాక్యములు మనకు బోధించుచున్నవి?**

క్రైస్తవ నాయకులు వారి తోటి సహోదరీ సహోదరుల కొరకు యేసు యొక్క అడుగుజాడలను అనుసరిస్తూ శ్రమలను అనుభవించెదరు. అవసరమైతే వారి పరిచర్యనిమిత్తము మరణించుటకు కూడా సిద్దపడుదురు. పౌలు తనను గూర్చి మరియు అపొల్లోను గూర్చి ఈ విధముగా చెప్పెను. "మేము మరణదండన విధింపబడిన వారమైయున్నాము" (1కొరింథి 4:9) వారికి తినుటకు తిండి, త్రాగుటకు నీరు లేనివారుగాను, ధరించుకొనుటకు వస్త్రములు లేనివారు గాను, నివసించుటకు నివాసము లేనివారుగాను ప్రజలు వారిని గూర్చి భావించిరి" (1కొరింథి 4:11). అంతమాత్రమే కాకుండా "వారి మీద నిందలు వేయబడెను. వారు హింసింపబడిరి. దూషింపబడిరి. వారు లోకమునకు మురికిగాను, అందరికి పెంటగాను ఎంచబడిరి" (1కొరింథి 4:12,13) వ్యతిరేకార్ధము నిచ్చునట్టి రీతిలో కొరింథీయులు ధనవంతులు, రాజులును, జ్ఞానులు మరియు ఘనులై యున్నారని (1కొరింథి 4:8,10) వర్ణిస్తూ క్రైస్తవ నాయకత్వములో గర్వమునకు చోటు లేదని, ఎందువలనంటే క్రైస్తవ సంఘములో విబేధాలు వచ్చుటకు అది మూలకారణమవుతుందని పౌలు చెప్పెను (1కొరింథి 4:6).

**క్రైస్తవ సంఘములో నీ పాత్ర ఏమైనప్పటికి క్రీస్తు నిమిత్తము నీవు ఎంతవరకు శ్రమను అనుభవించితివి? నీ జవాబులో ఏ పాఠాలను కనుగొనవచ్చును?**

**శుక్రవారం** **జూలై 17**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, అపొస్తలుల కార్యములనుండి "పన్నెండు మందికి తర్ఫీదు" పుటలు 17-24 చదువుడి.

"దేవుని సత్యమును నమ్మిన శేషించిన జనాంగము మధ్యన ఏకత్వము మరియు ఐక్యత ఉండును. వారు దేవుని చేత ఎన్నిక చేయబడిన ప్రత్యేక జనాంగమైయున్నారు. వారికి దేవునికి సత్యమున్నదని ఒక బలమైన వర్తమానము లోకమునకు ప్రకటించుటకున్నది. వారి మధ్యనున్న ఈ ఏకత్వము మరియు ఐక్యత భంగపరచుటకు వారి మధ్య నుండి దానిని నిర్మూలము చేయుటకు శత్రువైన సాతానుడు తీవ్రముగా ప్రయత్నిస్తాడు. నేటి సత్యమును వారి హృదయములలో నమ్ముట వలనను, వారి జీవితములలో దానిని మాదిరిగా చూపించుట వలనను వారు ఐక్యపర్చబడుటయే గాక అది వారికి శక్తివంతమైన పలుకుబడిని ఇస్తుంది" ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 1, పుట 327.

శాశ్వత సత్యమనే వేదిక మీద పరిపూర్ణమైన ఐకమత్యము కలిగియుండే రీతిలో దేవుడు ప్రజలను బలముగా నడిపిస్తాడు. ప్రత్యేకమైన జనాంగము మంచి కార్యములు చేయాలనే పట్టుదల కలిగియుండే విధముగా క్రీస్తు తనను తాను ఈ లోకమునకు అప్పగించుకొని ఆ జనాంగమును తన కొరకు పవిత్రపరచుకొనును. ఈ విధమైనటువంటి శుద్ధి చేసే ప్రక్రియలో క్రైస్తవ సంఘమును సమస్త అవినీతి నుండి పాప పరిహారము కావించే విధానమును ఉద్దేశించెను. అందుచేత వారిలో ఒకరినొకరు పడగొట్టుటకు బదులు, వారి శక్తి సామర్ధ్యాలను కూడగట్టి గొప్ప కార్యములు చేయుటకే ఏకమవుదురు. దేవుని ప్రజలందరు విశ్వాసములో ఐక్యపర్చబడి ఒక జనాంగముగా ఏర్పడే విధముగా ఆయన ఉద్దేశించెను. తన శిష్యులందరు ఏకత్వము కలిగియుండులాగున క్రీస్తు తన యొక్క సిలువ మరణమునకు ముందు ప్రార్ధించెను. ఆయన తన తండ్రితో ఏలాగు ఏకమైయుండెనో అట్టిరీతిగా శిష్యులు కూడా ఏకమైయుండాలని ఆయన ప్రార్ధించెను. అట్టి హృదయములను తట్టే ఆశ్చర్యకరమైన ప్రార్ధన తరతరములకు, చివరికి నేటి మన దినములవరకు చేరియున్నది. ఏలయనగా ఆయన మాటలు "నేను వీరి కొరకు మాత్రమే ప్రార్ధించుటలేదు కాని వీరి మాటలను బట్టి ఎందరైతే నన్ను నమ్ముదురో అట్టి వారి కొరకు ప్రార్ధింతును అని క్రీస్తు చెప్పెను" -ఎలెన్ జి వైట్, సంఘమునకు సాక్ష్యములు, సంపుటి 4, పుట 17.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. యేసు తన పరిచర్యను ఈ లోకములో ముగించిన తరువాత "తన శిష్యులలో, తనను వెంబడించిన వారిలో ఐక్యత ఉండాలని ప్రార్ధించెను" (యోహాను 17:21-23) ఈ లోకమును రక్షించుటకు దేవుడు తన కుమారుని పంపించగా, క్రీస్తునందు ఐక్యత ఆయనను వెంబడించు వారిలో ఉండాలి అనే ఈ సత్యమునకు బలమైన వాదనగా ఎందుకు ఉన్నది?
2. 1కొరింథి 4:9-13 చదువుడి. ఈ వాక్యములు ఏమి సూచిస్తున్నవి? అపొస్తలులు సూచించిన విధానమునకు నాయకత్వ విషయాలకు మధ్య తేడా ఏమిటి? ఈ లోక ప్రమాణాలకు దేవుని ప్రమాణములకు మధ్య ఉన్న తేడా ఏమిటి?
3. 1కొరింథి 4:16లో కొరింథీయులకు పౌలు విజ్ఞప్తి చేస్తూ తనను పోలి నడుచుకొనుడని చెప్పెను. మానవ నాయకులను పోలి నడుచుకొనుటకు నీవు ఇష్టపడుచున్నావా? అలా నడుచుకొనుటకు, అతడిని హెచ్చించి ప్రమాదకరమైన రీతిలో ఇతరులకు చూపి అతని వెంబడించుటలో ఉన్న తేడా ఏమిటి?

❋✶❋